అపరిశుభ్రతతో అనారోగ్యం



- దోమ కాటుతో ప్రాణాంతక వ్యాధులు
- నీటి నిల్వలతో దోమల వృద్ధి
- నియంత్రించాలని ప్రజల డిమాండ్

చెవుల వద్ద గుయ్యిమనేలా దోమల మోత. ఏ కాల మైనా సరే అపరిశుభ్రత నెలకొందంటే దోమలు వృద్ధి చెంది ప్రజారోగ్యంపై దాడి చేస్తాయి. ఒక్క దోమ కుట్టిందంటే దేహం రోగాలకు నిలయమవుతుంది. దోమలను నియంత్రించకుంటే మలేరియా, ఫైలేరియాసిస్, (బోదవ్యాధి), డెంగీ, మెదడు వాపు, చికున్ గున్యా వంటి ప్రాణాంతక వ్యాధుల్ని కలుగజే చేస్తాయి.

మిరుదొడ్డి(దుబ్బాక): దోమలు సర్వ సాధారణంగా నీరు నిలిచిన చిన్న చిన్న కుంటలు, పెంట కుప్పలు, మురికి కాలువల్లోనే కాకుండా అపరిశుభ్రత నెలకొనే ప్రదేశాల్లో దోమలు వృద్ధి చెందుతాయి. దోమల్లో ఆడ అనాఫిలిస్, క్యూలెక్స్, ఎడిస్, ఆర్మిజరీస్ మాన్‌సోనియా వంటి రకాలైన దోమలు అధికంగా వృద్ధి చెంది పలు రోగాలను కలుగ జేస్తాయి. ఇవి ప్రధానంగా మనుషుల రక్తాన్ని పీల్చి ఆహారంగా తీసుకుంటాయి. దోమలు కుట్టినప్పుడు మనుషులు తీవ్ర అస్వస్థకు గురవుతారు.

మలేరియా

మలేరియా వ్యాధికి గురైతే విపరీతమైన చలితో కూడిన జ్వరం వస్తుంది. సరైన సమయంలో గుర్తించక పోతే వ్యాధి జీవితాంతం బాధిస్తుంది. ఈ దోమలు ఎక్కువ శాతం అపరిశుభ్రత నెలకొన్న చోట్ల వృద్ధి చెందే అవకాశాలు ఉన్నాయి. అంతే రీతిలో ఈ వ్యాధి వ్యాప్తి చెందే అవకాశాలు మెండుగా ఉంటాయి.

ఫైలేరియాసిస్ (బోద వ్యాధి)

ఈ వ్యాధిని తొలిదశలో గుర్తించి సరైన వైద్యం చేయించుకుంటే కొద్దిమేర ఉపశమనం కలుగుతుంది. ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా జీవితాంతం కుమిలి పోయేలా బాధిస్తుంది. ఈ వ్యాధి సంభవించిందంటే కాళ్లు లేదా చేతులు విపరీతంగా వాచి పోతాయి.



ఇళ్ల మధ్య ఉన్న మురికి గుంతలు

దోమలకు నిలయంగా మురికి కాలువ

కాళ్లు ఏనుగు (ఎలిఫెంటాసిస్) కాళ్లలా తయారవుతాయి. తరచుగా జ్వరం, చంకల్లో, గజ్జల్లో బిల్లలు (గగ్గోడు) కట్టడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. క్యూలెక్స్ ఆడ దోమల ద్వారా వ్యాధి వ్యాపిస్తుంది.

డెంగీ

ఈ వ్యాధితో ఎముకలు, కండరాలు, కీళ్ల నొప్పులతో కూడిన జ్వరం వస్తుంది. జ్వరం కనీసం వారం పది రోజుల పాటు ఉండే అవకాశం ఉంది. కళ్ల నొప్పి, శరీరంపై దద్దుర్లు వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఈ వ్యాధి దోమల ద్వారా ఒకరి నుండి మరొకరికి వ్యాప్తి చెందుతుంది. దోమ కాటుకు గురి కాకుండా జాగ్రత్తలు పాటించాలి. వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే డాక్టర్లను సంప్రదించి సకాలంలో వైద్యచికిత్సలు చేయించుకోవాలి.

చికున్ గున్యా

చికున్ గున్యా సోకిందంటే కాళ్ల, కీళ్ళ నొప్పులు అధికంగా ఉంటాయి. మనుషులు లేవలేని స్థితికి చేరుకుంటారు. సకాలంలో వైద్య చికిత్సలు చేయించుకోవడం ఉత్తమం.

దోమకాటు నుంచి రక్షణకు..

- దోమ తెరలు విధిగా వాడాలి
- కిటికీల నుంచి దోమలు రాకుండా జాలీలు అమర్చుకోవాలి.
- శరీరాన్ని పూర్తిగా కప్పి ఉంచేలా పొడుగాటి దుస్తులు ధరించాలి.
- ఇంట్లో పిల్లలకు శ్వాస కోశ వ్యాధులు రాని విధంగా రసాయనాలతో పొగపెట్టాలి.
- ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చేయాలి.
- నీటి కుంటలు, మురికి కాలువల్లో కిరోసిన్, దోమల నివారణ మందులు పిచికారీ చేయాలి.
- గ్రామాల్లో మురికి కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలి. ఫాగింగ్ చేయాలి.
- నీటి నిల్వ పాత్రలు, ఎయిర్ కూలర్లు, డ్రమ్ముల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలి.
- ఓవర్ హెడ్ ట్యాంకుల్లో దోమలు గుడ్లు పెట్టకుండా మూతలు అమర్చుకోవాలి.
- సెప్టిక్ ట్యాంకు గొట్టాలు, గ్యాస్ పైపులైన్‌లకు పలుచని బట్ట చుట్టాలి.
- ఖాళీ సీసాలు, డబ్బాలు, రబ్బరు, కొబ్బరి చిప్పలు, పాత వాహనాల టైర్లలో నీరు లేకుండా చూసుకోవాలి.
- వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు, విద్యార్థులు, అధికారులు, ప్రజా ప్రతినిధులు, యువజన సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు ప్రజలకు అవగాహన కల్పించాలి.

నివారణకు చర్యలు తీసుకోవాలి



గ్రామాల్లో దోమలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. దోమకాటు వల్ల వయోబేధం లేకుండా అందరూ రోగాల భారిన పడుతున్నారు. దీంతో ఆసుపత్రుల్లో చేరి ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రత్యేక పాలనాధికారులు తక్షణమే స్పందించి దోమల నివారణకు చర్యలు తీసుకోవాలి

– ప్రవీణ్, అంది

అవగాహన కలిగి ఉండాలి



దోమకాటుకు గురైతే పలు వ్యాధులు సంభవిస్తాయి. ముందస్తు నివారణ చర్యలు చేపడితే ఫలితం ఉంటుంది. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. ఇంటి పరిసరాల్లో మురికి గుంతలు ఉంటే వెంటనే పూడ్చివేయాలి. ఇళ్ల మధ్య చెత్తకుప్పలు తొలగించాలి. వ్యాధులకు గురైన వారు సకాలంలో వైద్య పరీక్షలు చేయించుకోవాలి. పరిసరాల పరిశుభ్రతపై అవగాహన ఉంటే దోమలు వృద్ధి చెందవు.

– డాక్టర్ అమీనా సుల్తానా, మిరుదొడ్డి పీహెచ్‌సీ

క్లుప్తంగా

కార్యకర్తలకు బీఆర్‌ఎస్ అండ

ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి



మృతుడి కుటుంబానికి బీమా చెక్కు అందజేస్తున్న నాయకులు

మర్కూక్(గజ్వేల్): కార్యకర్తలకు బీఆర్‌ఎస్ అండగా ఉంటుందని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి అన్నారు. మర్కూక్ మండలం గంగాపూర్ గ్రామానికి చెందిన ఆ పార్టీ కార్యకర్త విశాల్‌సింగ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. పార్టీ సభ్యత్వం ఉండటంతో ప్రమాద బీమా కింద రూ.2 లక్షలు చెక్కు రూపంలో విడుదలైంది. ఆ చెక్కును ఆదివారం మృతుడి కుటుంబాన్ని పరామర్శించి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ కార్యకర్తలకు పార్టీ కొండంత అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పాండుగౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి, జెడ్పీటీసీ మంగమ్మ, వైస్‌ఎంపీపీ బాల్‌రెడ్డి, నాయకులు కనకయ్య పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా 11 కేవీ విద్యుత్ ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మలను తొలగిస్తున్న కారణంగా సోమవారం తాత్కాలికంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు సిద్దిపేట అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ సుధాకర్‌రెడ్డి తెలిపారు. ముర్షద్ గడ్డ, గణేష్‌నగర్, వివేకానంద చౌరస్తా, రైతుబజార్, అంబేద్కర్‌చౌరస్తా, మైత్రివనం, ఆదర్శ నగర్, రా జేందర్‌నగర్, మహాశక్తినగర్, విష్ణుష్‌నగర్, కాకతీయనగర్ పరిసర ప్రాంతాల్లో ఉదయం 7.30 గంటల నుంచి 9 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలన్నారు.

వైభవంగా బొడ్రాయి ప్రథమ వార్షికోత్సం



కలశ పూజ చేస్తున్న మాజీ సర్పంచ్ దేవ రాజశ్రీ, శ్రీనివాస్‌రెడ్డి దంపతులు

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని గూడెం గ్రామంలో బొడ్రాయి ప్రథమ వార్షికోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆదివారం మాజీ సర్పంచ్ దేవ రాజశ్రీ, శ్రీనివాస్ రెడ్డి దంపతులు కలశ పూజ అనంతరం బొడ్రాకి పంచామృతంతో అభిషేకం చేశారు. అనంతరం పోచమ్మకు బోనాలు సమర్పించారు. మహిళలు బోనాలతో పోచమ్మ ఆలయానికి వెళ్లి మొక్కులు చెల్లించుకున్నారు.


ధర్మ సమాజ్ పార్టీ మండల కమిటీ ఎన్నిక



ధర్మ సమాజ్ పార్టీ మండల కమిటీ సభ్యులు

తొగుట(దుబ్బాక): ధర్మ సమాజ్ పార్టీ మండల కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా యాసరేణి ప్రశాంత్, ప్రధాన కార్యదర్శిగా మోత్కురి రాజ్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా మాదారం మల్లేశం, కోశాధికారిగా నరేష్, కార్యదర్శులుగా మాదారం లింగం, కడిగాళ్ల సాగర్, సోషల్ మీడియా ఇన్‌చార్జిగా తిప్పారం రాజు, కార్యవర్గ సభ్యులుగా కరుణాకర్, రాజు, భిక్షపతి, రమేష్, యాదగిరి, నాంపల్లి, కుమార్, ప్రసాద్ ఎన్నికయ్యారు. ఈ ఎన్నికలు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బోయిని సదన్ సమక్షంలో జరిగాయి.

నిరాశ్రయ కుటుంబానికి చేయూత



ఆర్థిక సాయం అందజేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు, ట్రాక్టర్ యూనియన్ సభ్యులు

అక్కన్నపేట(హుస్నాబాద్): అక్కన్నపేట మండలం పంతుల్‌తండా గ్రామంలో ఇటీవల విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఓ ఇల్లు కాలిపోయింది. గ్రామ పరిధి లోని తారాచంద్‌తండాకు చెందిన బట్టు రాజు ఇల్లు అగ్ని ప్రమాదంలో కాలిపోవడంతో అతడి కుటుంబ సభ్యులు కట్టుబట్టలతో మిగిలారు. స్పందించిన గ్రామ ప్రభుత్వ ఉద్యోగులు తమ వంతుగా ఆదివారం రూ.40 వేల నగదు, 25 కిలోల బియ్యం నిరాశ్రయ కుటుంబానికి అందజేశారు.

పుచ్చలపల్లికి ఘన నివాళి



దుబ్బాకలో సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

దుబ్బాకటౌన్: కష్ట జీవుల రాజ్యం కోసం, పీడిత ప్రజల విముక్తి కోసం నిత్యం పోరాడిన గొప్ప త్యాగశీలి పుచ్చలపల్లి సుందరయ్య జీవితం యువతకు ఆదర్శం కావాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు గొడ్డుబర్ల భాస్కర్ అన్నారు. ఆదివారం పుచ్చపల్లి సుందరయ్య 39వ వర్ధంతి సందర్భంగా దుబ్బాకలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కొంపల్లి భాస్కర్, రాజు, మల్లేశం, మల్లికార్జున్, వెంకట స్వామి, తదితరులున్నారు.

పీడిత ప్రజల విముక్తి కోసం..

చేర్యాల(సిద్దిపేట): పీడిత ప్రజల విముక్తి కోసం పోరాడిన పుచ్చలపల్లి సుందరయ్య జీవితం ఆదర్శమని సీపీఎం మండల, పట్టణ కార్యదర్శులు కొంగరి వెంకట్‌మావో, రాళ్లబండి నాగరాజు అన్నారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు అరుణ్‌కుమార్, శ్రీహరి, నర్సిరెడ్డి, భాస్కర్, రమ, లావణ్య, లక్ష్మీ, నురూబీ, మల్లేశం, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

బెజ్జంకిలో ..

బెజ్జంకి(సిద్దిపేట): పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని ఆదివారం సీపీఎం నాయకులు బెజ్జంకిలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి తిప్పారపు శ్రీనివాస్, సంగ ఎల్లయ్య, బొనగిరి లింగం, కనకయ్య, రాములు, సంపత్, బాలయ్య పాల్గొన్నారు.

సుందరయ్య ఆశయ సాధనకు..

కొమురవెల్లి(సిద్దిపేట): దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత కామ్రెడ్ పుచ్చలపల్లి సుందరయ్య ఆశయ సాధనకు కృషిచేయాలని సీపీఎం మండల కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం సుందరయ్య 39 వర్ధంతి కార్యక్రమాన్ని సీపీఎం కార్యాలయంలో నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు అత్తిని శారద, రాంసాగర్ మాజీ సర్పంచ్ తాడూరి రవీందర్, బద్దిపడగ కృష్ణారెడ్డి, సార్ల యాదయ్య, దాసారి బాల స్వామి, ఆరుట్ల రవీందర్, దాసరి చక్రపాణి, తాడూరి భరత్, జ్యోతి పాల్గొన్నారు.

యోగాతో మానసిక దృఢత్వం

మున్సిపల్ చైర్‌పర్సన్ వనిత



యోగా శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనిత

దుబ్బాక: యోగాతో మానసికంగా, శారీరకంగా దృఢత్వంగా ఉంటారని మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనిత అన్నారు. ఆదివారం దుబ్బాకలో సత్యసాయి సేవాసమితి సౌజన్యంతో రంజిత్ గురూజీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వ్యక్తిత్వ వికాసం, ఉచిత ధ్యాన యోగ శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మానవాళికి యోగాతో చాలా ఉపయోగాలున్నాయి. శిక్షణా శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నృసింహ జయంతి ఉత్సవాలకు అంకురార్పణ

వర్గల్(గజ్వేల్): నాచగిరి శ్రీలక్ష్మీ నృసింహ క్షేత్రంలో ఆదివారం రాత్రి శ్రీస్వామివారి జయంతి ఉత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు వేదపండితులు స్వామి వారి జయంతి ఉత్సవాలకు అంకురార్పణ చేశారు. మొదట విశ్వక్సేన ఆరాధన, అనంతరం పుణ్యాహావాచనం, రక్షాబంధనం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. నివేదన అనంతరం భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు.

14కు పైగా ఎంపీ స్థానాలు ఖాయం

కాంగ్రెస్ దుబ్బాక ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి

దుబ్బాక: రాహుల్ గాంధీ నేతృత్వంలో ఇండియా కూటమి అధికారంలోకి రాబోతుందని దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి జోస్యం చెప్పారు. ఆదివారం పట్టణంలో కాంగ్రెస్ నాయకుడు మల్లుగారి చంద్రారెడ్డి అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకొని ఆయనను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో 14కు పైగా ఎంపీ సీట్లు కాంగ్రెస్ కైవసం చేసుకుంటుందన్నారు. మెదక్ లో నీలం మధు భారీ మెజార్టీతో గెలుపొందడం ఖాయమన్నారు. ఆయన వెంట పార్టీ నాయకులు యేసురెడ్డి, బాల్‌రెడ్డి, కాల్వ నరేష్, ఆకుల దేవేందర్, మచ్చ శ్రీనివాస్, అనంతుల శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

గ్రంథాలయం ప్రారంభం

కొండపాక(గజ్వేల్): గ్రంథాలయాలు మేధాశక్తిని పెంచేందుకు దోహదపడతాయని ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని సిర్సనగండ్ల గ్రామంలో ఏర్పాటుచేసిన లైబ్రరీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత రోజూ గ్రంథాలయానికి వెళ్లడం అలవాటు చేసుకోవాలన్నారు. గ్రామ అంబేద్కర్ యువజన సంఘం, టీచర్ దుబ్బ రాములు రూ.20 వేల విలువ చేసే పుస్తకాలను లైబ్రరీకి బహూకరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాములు, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం లారీ బోల్తా

దుబ్బాకరూరల్: రామాయంపేట నుంచి సిద్దిపేట వెళ్తున్న ధాన్యం లారీ ఆదివారం తిమ్మాపూర్ వద్ద నిర్మిస్తున్న కల్వర్టులో పడింది. ప్రమాదంలో ఎవరూ గాయపడలేదు. లారీ పాక్షికంగా దెబ్బతింది.

కాంగ్రెస్ అభ్యర్థికే మా మద్దతు

మరుమాముల నాయకులు

మద్దూరు(హుస్నాబాద్): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ మద్దతు కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి తీన్మార్ మల్లన్నకే ఇస్తామని ఆ పార్టీ నాయకులు స్పష్టం చేశారు. ఆదివారం మద్దూరు మండల పరిధిలోని మరుమాముల గ్రామ నూతన గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఉత్కం ఆంజనేయులు గౌడ్, ప్రధాన కార్యదర్శిగా ఒగలబోయిన యాదగిరి గౌడ్, గ్రామ యూత్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా వేచరేణి తిరుపతి, ప్రధాన కార్యదర్శిగా గూళ్ల రవి, సోషల్ మీడియా ఇన్‌చార్జి కత్తుల భాస్కర్‌రెడ్డిను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఇప్ప నిషికాంత్ రెడ్డి, పెద్దవుట్ల కరుణాకర్ రెడ్డి, సుందరగిరి సత్యనారాయణ గౌడ్, మాజీ సర్పంచ్‌లు గోపాల్ రెడ్డి, జంగిల్ భిక్షపతి, మాజీ వైస్ ఎంపీపీ పెద్ద ఊట్ల భూపతిరెడ్డి, నూకల సత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వరికి బోనస్ ఇవ్వాలి



రైతులతో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

జగదేవ్‌పూర్(గజ్వేల్): ఎన్నికల ముందు రైతులకు ఇచ్చిన హామీ ప్రకారం ధాన్యానికి రూ.500 బోనస్ ఇవ్వాలని, అలాగే అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, ఎంపీటీసీ కవిత ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం జగదేవ్‌పూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయడంలో విఫలమైందన్నారు. కార్యక్రమంలో నాయకులు ఉపేందర్‌రెడ్డి, నాగరాజు, మహేష్, గణేష్, ప్రశాంత్, శ్రీను పాల్గొన్నారు.

అనుమతులు లేని విద్యాసంస్థలను సీజ్ చేయాలి

ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు రంజిత్‌రెడ్డి



మాట్లాడుతున్న ఆముదాల రంజిత్‌రెడ్డి

కొమురవెల్లి(సిద్దిపేట): జిల్లా వ్యాప్తంగా అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న విద్యాసంస్థలను వెంటనే సీజ్ చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు ఆముదాల రంజిత్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో తాడూరి భరత్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఏటా అనుమతులు లేకుండా అనేక కార్పొరేట్, విద్యాసంస్థలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయన్నారు. ఈ విషయంలో విద్యాశాఖ అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడంలేదని ఆరోపించారు. ఉన్నతాధికారులు స్పందించి జిల్లాలో అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న విద్యా సంస్థలపై చర్యలు చేపట్టాలని, లేని పక్షంలో ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో తాడూరి విక్రమ్, యోగి, బన్నీ తదితరులు పాల్గొన్నారు.

దుండగులను అరెస్ట్ చేయాలి

డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్



మాట్లాడుతున్న డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్

మిరుదొడ్డి(దుబ్బాక): ఏపీలోని తిరుపతి జిల్లా వెంకటగిరిలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను తక్షణమే అరెస్ట్ చేయాలని దళిత బహుజన ఫ్రంట్ (డీబీఎఫ్) జాతీయ కార్యదర్శి పి.శంకర్ డిమాండ్ చేశారు. ఆదివారం మిరుదొడ్డిలో ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసి వారంరోజులైనా ఏపీ ప్రభుత్వం నిందితులను అరెస్టు చేయకపోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. భారీ విగ్రహాలను పెట్టి వాటి పరిరక్షణకు చర్యలు తీసుకోకపోవడం సిగ్గుచేటని మండిపడ్డారు. నిందితులను అరెస్టు చేయకపోతే తెలుగు రాష్ట్రాల్లో ప్రజా తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో మంజీర దళిత సేవా సమితి నాయకులు పెద్ద లింగన్నగారి కిరణ్, కె. చందు, బి.శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సిల్వర్ జూబ్లీ వేడుకలో పాల్గొన్న 1998-99 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని బేగంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుకున్న 1998–99 బ్యాచ్ విద్యార్థులు సిల్వర్ జూబ్లీ వేడుకలను ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. కుటుంబ సమేతంగా పాల్గొన్న విద్యార్థులు చిన్ననాటి సంగతులను గుర్తు చేసుకున్నారు. ఆటపాటలతో సందడి చేశారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు చెప్పిన ఉపాధ్యాయులు అనంతరెడ్డి, శ్రీనివాసాచారి, దేవేందర్, వెంకన్నను సన్మానించారు.



చాట్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2007-08 బ్యాచ్ విద్యార్థులు

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని చాట్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివిన 2007–08 బ్యాచ్ విద్యార్థులు ఆదివారం పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. తమకు పాఠాలు చెప్పిన గురువులు సత్యానారాయణ, వెంకటేశ్వర్లు, శ్రీను, రవీందర్‌రెడ్డి, మల్లేశం, బాలకృష్ణరెడ్డి, నర్సింలు, బాపురెడ్డిను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నరేష్, ఎంపీటీసీ కావ్య పాల్గొన్నారు.

రేణుకా ఎల్లమ్మకు బోనాలు

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ మండలం పొట్లపల్లి గ్రామస్తులు ఆదివారం రేణుకా ఎల్లమ్మకు బోనాల ఉత్సవం నిర్వహించారు. వైశాఖ పౌర్ణమి పురస్కరించుకొని రేణుకా ఎల్లమ్మ జాతరను నిర్వహిస్తారు. గీత కార్మిక కుటుంబాలు ఎల్లమ్మ పట్నాలు వేసి అమ్మవారికి బోనం సమర్పించారు.



బోనాలతో వెళ్తున్న మహిళలు

ఎల్‌ఈడీ బల్బుల బహూకరణ



బల్బులను అందజేస్తున్న వెంకటేశ్వర్లు

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ మండలం తోటపల్లి గ్రామ హనుమాన్ దేవాలయానికి గ్రామస్తుడు కోటి వెంకటేశ్వర్లు ఎల్‌ఈడీ బల్బులను ఆదివారం బహూకరించాడు. ఆలయంలో చీకటిగా ఉందని హనుమాన్ దీక్ష చేపట్టిన స్వాములు చెప్పడంతో స్పందించి వెంటనే బల్బులు అందజేశారు.

పట్టపగలు 'ఊరంతా' వెలుగులు

అక్కన్నపేట(హుస్నాబాద్): విద్యుత్, పంచాయతీ అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా పట్టపగలే ఊరంతా స్ట్రీట్ లైట్లు వెలుగుతున్నాయి. దీంతో విలువైన విద్యుత్ వృథా అవుతోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. స్ట్రీట్ లైట్ల నిర్వహణ సమస్యలను సంబంధిత సిబ్బంది పట్టించుకోవడం లేదని గ్రామస్తులు చెబుతున్నారు. అక్కన్నపేట మండలంలోని కుందనవానిపల్లి గ్రామంలో రేయింబవళ్లు స్ట్రీట్ లైట్లు వెలుగుతున్నాయి. ప్రత్యేక లైన్‌లు, ఆన్ ఆఫ్ స్విచ్‌లు ఏర్పాటు చేస్తే సమస్య పరిష్కారమవుతుందని పలువురు అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం నిరంతర విద్యుత్ సరఫరా చేయడానికి రూ.వేల కోట్లు వెచ్చిస్తోంది. విద్యుత్‌ను ఆదా చేయాల్సి సంబంధిత అధికారుల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. నిరంతరం వెలుగుతుండటంతో పంచాయతీలకు బిల్లులు రూ.వేలల్లో వస్తున్నాయి. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



కుందనవానిపల్లిలో పట్టపగలే వెలుగుతున్న స్ట్రీట్ లైట్

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
యం. నాగరాజు-9010957373
రమేష్ - 9951952990